## క్లుప్తంగా

### సత్తెమ్మ తల్లికు పుట్టింటి సారె సమర్పణ



సారె తీసుకొస్తున్న విజయలక్ష్మి తదితరులు

సీటీఆర్ఐ: స్థానిక నారాయణపురంలో ఉన్న సత్తమ్మ తల్లి ఆషాడ మాసం పుట్టింటి సారె ఉత్సవం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శనివారం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి పాల్గొని అమ్మవారికి సారె సమర్పించారు. ఈ సందర్భంగా జక్కంపూడి విజయలక్ష్మి మాట్లాడుతూ ఏటా అమ్మవారికి ఆషాడ మాసం సందర్భంగా అమ్మవారికి పుట్టింటి సారె సమర్పించడం ఆనవాయితీ వస్తోందన్నారు. మహిళలు భారీ ఎత్తున పాల్గొని అమ్మవారికి పసుపు, కుంకుమ, చలివిడి, పానకం, చీర, గాజులు సమర్పించారు. మానే దొరబాబు, ఆలయ కమిటీ సభ్యులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

### వీరాయమ్మకు పుష్పాంజలి

కడియం: దుళ్ళ సర్పంచ్ కొండపల్లి పట్టియ్య తల్లి వీరాయమ్మకు పలువురు ప్రముఖులు శనివారం పుష్పాంజలి ఘటించారు. ఇటీవల వీరాయమ్మ మృతి చెందిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో దుళ్ళలోని వారి స్వగృహంలో ఏర్పాటు చేసిన సంతాప సభకు వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు హాజరై ఆమె చిత్రపటం వద్ద పుష్పాంజలి ఘటించారు. పట్టియ్య, కుటుంబ సభ్యలకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. సభలో మాజీ ఎమ్మెల్యే చందన రమేష్, కడియం ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్, మండల టీడీపీ అధ్యక్షుడు వెలుగుబంటి రఘురామ్, దుళ్ళ ఉప సర్పంచ్ తోకల శ్రీనివాసరావు, ఎంపీటీసీ పుత్సల బసవశంకర్, మాజీ సర్పంచ్ గుర్రపు సత్యనారాయణపాల్గొన్నారు.

### ఉత్సాహంగా టేబుల్ టెన్నిస్



టేబుల్ టెన్నిస్‌లో పోటీ పడుతున్న క్రీడాకారులు

ప్రకాశం నగర్: జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఏపీ స్టేట్ ర్యాంకింగ్ టేబుల్ టెన్నిస్ పోటీలు రాజమహేంద్రవరం గోదావరి గట్టున ఉన్న శ్రీత్యాగరాజ నారాయణ దాసు సేవ సమితి ఆడిటోరియంలో రెండో రోజు శనివారం ఉత్సాహంగా కొనసాగాయి. శుక్రవారం లీగ్ కం నాకౌట్ పద్ధతిలో సాగిన పోటీలు శనివారం అన్ని విభాగాల్లో మెయిన్ డ్రాకు చేరుకున్నాయి. పది టేబుల్స్‌పై హోరాహోరీగా జరుగుతున్న ఈ పోటీలను ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్ వి.భాస్కర్ రామ్ పర్యవేక్షించి క్రీడాకారులకు అవసరమైన ఏర్పాట్లపై సమీక్షించారు. ఆదివారం క్వాటర్ ఫైనాల్స్, సెమీ ఫైనాల్స్, ఫైనాల్స్ నిర్వహించి విజేతలను ప్రకటించే అవకాశం ఉందని అసోసియేషన్ కార్యదర్శి వీటీవీ సుబ్బారావు తెలిపారు.

### ఘనంగా రైతు దినోత్సవం

కంబాలచెరువు: ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ కళాశాలలో దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని పురస్కరించుకొని శనివారం రైతు దినోత్సవం నిర్వహించారు. కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ సీహెచ్ శ్యామ్‌రాజ్ నాయక్ ఆధ్వర్యంలో కళాశాల జాతీయ సేవా పథకం సిబ్బంది, విద్యార్థులు డాక్టర్ రాజశేఖర రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సీతానగరం గ్రామం అభ్యుదయ రైతు సూర్య ప్రకాష్‌రావును జ్ఞాపికతో సన్మానించారు. సీనియర్ ప్రొఫెసర్ అనూరాధ, జాతీయ సేవా పథకం అధికారులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

### నేటి నుంచి నామినేషన్లు

కడియం: కడియపులంకలోని సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ పాలకవర్గం ఎన్నికలకు నామినేషన్ల ప్రక్రియ ఆదివారం ఉదయం 9 గంటల నుంచి ప్రారంభమవుతుందని ఎన్నికల కమిటీ సభ్యులు తెలిపారు. 9, 10 రెండు రోజుల పాటు నామినేషన్లను స్వీకరిస్తారన్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ కడియపులంకలోని అసోసియేషన్ కార్యాలయంలో నామినేషన్లు దాఖలు చేయవచ్చన్నారు. కాగా ఆదివారం నామినేషన్లు దాఖలు చేసే వారు డిపాజిట్ మొత్తం డీడీ రూపంలో కాకుండా నగదు రూపంలో చెల్లించాలన్నారు. సోమవారం డీడీలు ఇచ్చి నగదు వాపసు తీసుకోవచ్చునన్నారు. అలాగే వార్డుల వారీగా ఓట్ల జాబితాలను కార్యాలయం వద్ద అందుబాటులో ఉంచినట్టు ఎన్నికల కమిటీ తెలిపింది. పోటీ చేసే అభ్యర్థులు నిర్ణీత రుసుం చెల్లించి ఓటర్ల జాబితాలను తీసుకోవచ్చునన్నారు.



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న సిటీ కోఆర్డినేటర్ గుడూరు శ్రీనివాస్



కేక్ కట్ చేస్తున్న యువజన విభాగం రీజినల్ కోఆర్డినేటర్ జక్కంపూడి గణేష్



కడియపులంకలో కేక్ కట్ చేస్తున్న డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు తదితరులు



ధవళేశ్వరం పోలీస్‌స్టేషన్ సెంటర్‌లో కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

# వైఎస్సార్ చిరస్మరణీయుడు

- ఘనంగా డాక్టర్ రాజశేఖరరెడ్డి జయంతి
- పేదలకు, ఆటో డ్రైవర్లకు దుస్తుల పంపిణీ
- మహిళలకు చీరలు, వృద్ధులకు పండ్లు అందజేత
- రక్తదానం చేసిన వైఎస్సార్ సీపీ శ్రేణులు

రాజమహేంద్రవరం సిటీ: పేదల కోసం ఎన్నో పథకాలు ప్రవేశపెట్టి సంక్షేమ సారథిగా పేరుపొందిన మహానేత రాజశేఖరరెడ్డి చిరస్మరణీయుడని పలువురు వక్తలు కొనియాడారు. శనివారం మాజీ ముఖ్యమంత్రి దివంగత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 74వ జయంతిని నగరంలో వైభవంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ శ్రేణులు, అభిమానులు కేక్ కట్ చేసి, పలు సేవా కార్యక్రమాలు చేశారు. దీంతో పండగ వాతావరణం నెలకొంది. వైఎస్సార్ సీపీ సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో ఉభయ రాష్ట్రాల బీసీ జేఏసీ చైర్మన్ మార్గాని నాగేశ్వరరావు, రుడా చైర్ పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల యువజన విభాగం రీజినల్ కో ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పాలిక శ్రీను, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, పార్టీ మాజీ కార్పొరేటర్లు, వార్డు ఇన్‌చార్జులు, గృహసారథులు, కన్వీనర్లు, పార్టీ కార్యకర్తలు విశేష సంఖ్యలో పాల్గొన్నారు. నగరంలోని వీఎల్ పురం ఎంపీ కార్యాలయంలో నిర్వహించిన వైఎస్సార్ జయంత్యుత్సవంలో భారీ కేక్ కట్ చేశారు. పేదలకు చీరలు పంపిణీ చేశారు. కోట గుమ్మం సెంటర్‌లో డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 74 కేజీల భారీ కేక్ కట్ చేశారు. తర్వాత రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పుష్కర ఘాట్ వద్ద నిర్వహించిన వైఎస్సార్ జయంతి కార్యక్రమంలో టీకే విశ్వేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో పేదలకు, ఆటో డ్రైవర్లకు దుస్తులు అందజేశారు. యాచకులకు దుప్పట్లు పంపిణీ చేశారు. క్వారీ మార్కెట్ సెంటర్ వద్ద మాజీ కార్పొరేటర్ అజ్జరపు వాసు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పేదలకు చీరలు, దుస్తులు అందజేశారు. లాలా చెరువు సెంటర్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో కార్పొరేషన్ మాజీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గుత్తుల మురళీధర్ పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. తాడితోట సెంటర్ వద్ద ముత్యాలు వీరప్పారావు ఆధ్వర్యంలో బైపా రోడ్డులోని వాంబే గృహాల వద్ద జయంతి వేడుకలు నిర్వహించారు. పార్టీ నాయకులు సంకిస భవానీ ప్రియ, పిల్లి నిర్మల పెద్ద వేంకటేశ్వర్లు, కాలే చిన్ని, అడపా రాజు, వాకచర్ల కృష్ణ, యిన్నమూరి దీపు, కొండబాబు, శ్రీనగేష్, విజయలక్ష్మి, రామకృష్ణ, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

**హైటెక్ బస్టాండ్ వద్ద ..**

సంక్షేమ ప్రదాతగా నేటికీ దివంగత మహానేత డాక్టర్



కోటగుమ్మం సెంటర్లో కేక్ కట్ చేస్తున్న సిటీ కోఆర్డినేటర్ గూడూరు శ్రీనివాస్ చిత్రంలో రుడా చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలరెడ్డి మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు

వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రజల గుండెల్లో నిలిచి ఉన్నారని రుడా చైర్ పర్సన్ మేడపాటి షర్మిలా రెడ్డి పేర్కొన్నారు. వైఎస్సార్ జయంతి సందర్భంగా హైటెక్ బస్టాండ్ వద్ద జగనన్న ఎమ్మెస్సార్ స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి రాజశేఖరరెడ్డి చిత్రపటానికి నివాళులు అర్పిచారు.

**49వ డివిజన్‌లో**

పార్లమెంట్ ఎస్సీసెల్ అధ్యక్షుడు మాసా రామ్ జోగ్ ఆధ్వర్యంలో 49వ వార్డు సుబ్బారావు నగర్‌లో వైఎస్సార్ జయంతి నిర్వహించారు. ముందుగా రాజశేఖర రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు.

**సంక్షేమ ప్రదాత వైఎస్సార్**

ధవళేశ్వరం: సంక్షేమ ప్రదాత దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి అని వైఎస్సార్ సీపీ రూరల్ కో–ఆర్డినేటర్, ఆంధ్రప్రదేశ్ పచ్చదనం, సుందరీకరణ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ పేర్కొన్నారు. ధవళేశ్వరం టిడ్కో గృహాల వద్ద జరిగిన దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి కార్యక్రజమానికి చందన నాగేశ్వర్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. తొలుత వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. వైఎస్సార్ సీపీ నాయకులు సాధనాల చంద్రశేఖర్(శివ), రేగుళ్ళ రాజు,ప్రసాద్, కామేశ్వరరావు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

**ధవళేశ్వరంలో**

ప్రజల హృదయాల్లో దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి చెరగని ముద్ర వేసుకున్నారని వైఎస్సార్ సీపీ నాయకులు సాధనాల చంద్రశేఖర్(శివ), హితకారిణి సమాజం డైరెక్టర్ దేవులపల్లి సరితారాణి, వక్ఫ్ బోర్డు డైరెక్టర్ షట్టర్ భాషా, దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు ముత్యాల పోసి కుమార్ పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ నాయకుల ఆధ్వర్యంలో శనివారం ధవళేశ్వరం పోలీస్‌స్టేషన్ సెంటర్, బ్యారేజ్ సెంటర్‌లో ఉన్న మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. ధవళేశ్వరం పంచాయతీ కార్యాలయంలో గ్రామ కార్యదర్శి దాసరి సూరిబాబు ఆధ్వర్యంలో వైఎస్సార్ జయంతిని ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు గరగ శ్రీనివాసరావు, గునిపె అశోక్, రేగుళ్ళ రాజు, పేర్ల బాసి, పుట్టా పరేష్‌నాథ్, శ్రీరంగం బాలరాజు,మెండా రాజేష్, బర్రి కామేశ్వరరావు, రేగుళ్ళ రఘు, ముత్యాల జాన్, నంబూరి రవి,దాసరి ధర్మ,ముద్దాడ బాబీ, గూటం రాజు, ఇందల మెహర్, తులసీరామ్ తదితరులు పాల్గొన్నారు.

**పేదల పెన్నిధి వైఎస్సార్**

కడియం: తన పాలనలో పేదలను ఆదుకున్న దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రజల హృదయాల్లో నిలిచిపోయారని డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు అన్నారు. శనివారం కడియపులంక జాతీయ రహదారి పక్కనే ఉన్న వైఎస్ విగ్రహానికి ఆయన పుష్పాంజలి ఘటించారు. కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. పేద ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన నాయకుడు డాక్టర్ వైఎస్సార్ అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఈలి గోపాలం, సొసైటీ చైర్మన్ తిరుమలశెట్టి శ్రీను, మండల జేసీఎస్ కన్వీనర్ తాడాల చక్రవర్తి, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం వీరవరంలో వైఎస్సార్ విగ్రహానికి ఆకుల వీర్రాజు పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో రాష్ట్ర దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ దొంతంశెట్టి వీరభద్రయ్య, జేసీఎస్ కన్వీనర్ తాడాల విష్ణుచక్రవర్తి, మాజీ ఉపసర్పంచ్ దొంతంశెట్టి చినవీర్రాజు, స్థానిక నాయకులు పాల్గొన్నారు. మండల కేంద్రమైన కడియంలో సొసైటీ అధ్యక్షులు, పార్టీ రాష్ట్రకార్యదర్శి గిరజాల వీర్రాజు (బాబు) ఆధ్వర్యంలో రైతులను ఘనంగా సత్కరించారు. ఉత్తమ రైతులు గెద్దాడ విష్ణుష్, వారణాసి బ్రహ్మాజీ, పడాల పెద్ద సత్యనారాయణ, బండారు భాస్కరరావు, అడపా వీరబ్రహ్మం, చిక్కాల శ్రీనివాస్‌లను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. అనంతరం దేవీగుడి సెంటర్‌లోని వైఎస్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. కేక్ కట్ చేశారు. మండల వ్యవసాయాధికారి కె.ద్వారకాదేవి, మాజీ సర్పంచ్ దాసరి శేషగిరి, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు. వేమగిరి జంక్షన్‌లో వైఎస్సార్ విగ్రహం వద్ద పుష్పాంజలి ఘటించారు. పార్టీ నాయకులు డాక్టర్ వెలుగుబంటి వెంకటాచలం ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పంపిణీ చేశారు.

జేగురుపాడు గ్రామంలో సర్పంచ్, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు యాదల సతీష్‌చంద్రస్టాలిన్ ఆధ్వర్యంలో వైఎస్ విగ్రహం వద్ద పుష్పాంజలి ఘటించారు. పొట్టిలంకలో శాప్‌డైరెక్టర్ భీమిరెడ్డి నాగేంద్ర వైఎస్సార్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. స్థానిక నాయకులు పాల్గొన్నారు. దుళ్ళ పంచాయతీ కార్యాలయంలో వైఎస్సార్ జయంతి నిర్వహించారు. ఉప సర్పంచ్ తోకల శ్రీనివాసరావు, ఎంపీటీసీ కట్టుంగ నాగరాజు, రైతులు పాల్గొన్నారు. మురమండలంలో వైఎస్సార్ అభిమానులు పుష్పాంజలి ఘటించారు. కడియపులంక సొసైటీ కార్యాలయంలో వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. సొసైటీ అధ్యక్షుడు తిరుమలశెట్టి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఈలి గోపాలం, పార్టీ నాయకలు, రైతులు పాల్గొన్నారు. బుర్రిలంకలో వైఎస్సార్ జయంతిని నిర్వహించారు.



బొమ్మూరులో క్షీరాభిషేకం చేస్తున్న వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్

## ప్రజల గుండెల్లో నిలిచిన మహామనిషి వైఎస్సార్

రాజమహేంద్రవరం రూరల్: సంక్షేమ పథకాలతో రాష్ట్ర ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన మహామనిషి వైఎస్ రాజశేఖరరెడ్డి అని వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్, ఏపీగ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ కొనియాడారు. బొమ్మూరు వైఎస్సార్ సెంటర్‌లో వైఎస్సార్ టీయూసీ జిల్లా అధ్యక్షుడు ముద్దాల అను, గ్రామ కమిటీ ఆధ్వర్యంలో వైఎస్సార్ జయంతి వేడుకల్లో ఆయన విగ్రహానికి 74 లీటర్లతో క్షీరాభిషేకం చేశారు. ఆయన, ప్రముఖ న్యాయవాది గొందేశి శ్రీనివాసులరెడ్డి చేతుల మీదుగా నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చందన నాగేశ్వర్ మాట్లాడుతూ వైఎస్సార్ ఆశయసాధనను నెరవేర్చడంతో పాటు, ఆయనకు మించి అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి సీఎం జగన్ ప్రజల గుండెల్లో నిలుస్తున్నారన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా దివ్యాంగుల సెల్ అధ్యక్షుడు ముత్యాల పోసికుమార్, పార్టీ నాయకులు యెనుముల త్యాగరాజు, సద్గుణ రామారెడ్డి, కేవీ సుబ్బారెడ్డి, దాకే శ్రీను, ఎలిగొండలక్ష్మి, సోమనశ్రీను, మత్సేటిశివ, వైఎస్‌కుమార్, తోడేటిరాజా, ట్రేడ్ యూనియన్‌నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**శాటిలైట్‌సిటీలో:**

శాటిలైట్‌సిటి బస్టాండ్‌లో గ్రామకమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వైఎస్సార్ జయంతి వేడుకలలో రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ పాల్గొని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సచివాలయ కన్వీనర్లు, పార్టీనాయకులు పాల్గొన్నారు.

**రాజవోలు గ్రామంలో:**

రాజవోలు గ్రామంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్తకార్యదర్శి పెయ్యలరాజేష్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. నేత్రకంటి ఆసుపత్రి, బొల్లినేని ఆసుపత్రి వైద్యులు రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. ముందుగా వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

**తొర్రేడులో..**

తొర్రేడు సెంటర్‌లోని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఉప్పులూరి వీరవెంకట సత్యనారాయణ ఆధ్వర్యంలో వైఎస్సార్ జయంతిని నిర్వహించారు. వైఎస్సార్, జక్కంపూడి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల వ్యవసాయ సలహా కమిటీ అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీమన్నారాయణ, సొసైటీ చైర్‌పర్సన్ చిట్టూరి వెంకటరావు, ఉప్పులూరిరాము, సచివాలయ కన్వీనర్లు, పార్టీనాయకులు పాల్గొన్నారు.



కేకును చందన నాగేశ్వర్‌కు తినిపిస్తున్న గొందేశి శ్రీనివాసులరెడ్డి

## విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయాలి

- కథ చెబుతావా ఊ కొడతాం కథల పోటీల్లో విజేతలకు బహుమతులు

సీటీఆర్ఐ: విద్యార్థులలో సృజనాత్మకతను వెలికితీయాలని సాధు స్త్రీ మఠం పీఠాధిపతి సాధు గాయత్రి బాయి అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ తూర్పు గోదావరి జిల్లా శాఖ ఆధ్వర్యంలో కథ చెప్తావా ఊకొడతాం అను శీర్షికతో విద్యార్థులకు కథల పోటీలు స్థానిక వీరభద్రపురం సాధు స్త్రీల మఠంలో నిర్వహించారు. అనంతరం విజేతలకు నగదు బహుమతులు అందజేశారు. ఈ కథల పోటీలు జూనియర్, సీనియర్ విభాగాల్లో నిర్వహించారు. ఈ కథల పోటీల్లో 125 మంది విద్యార్థులు పాల్గొనగా సీనియర్స్ విభాగంలో మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతి విజేతలు ప్రణతి, సాయి శ్రీభగవాన్, శ్రీజలు బహుమతులను పొందారు. జూనియర్స్ విభాగంలో మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులను వరుసగా హర్షిత, చంద్ర పద్మిని, సౌగంధిక బహుమతులు అందుకున్నారు. ఈ పోటీల్లో విజేతలకు మొదటి బహుమతి రూ.1000, రెండో బహుమతి రూ.750 మూడో బహుమతి రూ.500 అందజేశారు.బహుమతులు విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో న్యాయనిర్ణేతులుగా దీపిక, సీతమహాలక్ష్మి వ్యవహరించారు. టి.టి.డి. ప్రోగ్రాం ఆఫీసర్ ఒరుగంటి నరసింహయోగి, టి.టి.డి.జిల్లా ధర్మ ప్రచార పరిషత్ సభ్యులు కె. సతీష్, కాలెపు సత్యసాయిరామ్ తదితరులు పాల్గొన్నారు.



పోటీలలో పాల్గొన్న విద్యార్థులు

## పుష్కరాల రేవుకు చేరిన శ్రీవారి పాదాలు

ప్రకాశం నగర్: కాకినాడ నుంచి తిరుమలకు నడిచి వెళ్లి, తిరుమల నుంచి శ్రీవారి పాదాలతో కాకినాడకు కాలినడకన ప్రదక్షిణ పాదయాత్ర చేస్తున్న భోగి గణపతి పీఠం వ్యవస్థాపకులు దుసర్లపూడి రమణరాజు స్వామి శనివారం సాయంత్రం పుష్కరాల రేవుకు చేరి పుణ్యస్నానం ఆచరించారు. ఆయనకు పండితులు ఘన స్వాగతం పలికారు. శ్రీవారి పాదాలకు వేదశీర్వచనం నిర్వహించారు. ఈ సందర్భంగా రమణరాజు స్వామి మాట్లాడుతూ తిరుమలకు కాలినడకన వెళ్లి కాకినాడలో భోగి గణపతి పిఠానికి శ్రీవారి పాదాలు ప్రతిష్ఠ చేయడం పూర్వకాలంలో మహా మునులు చేపట్టిన దైవకార్యం వంటిదన్నారు. 1300 కిలోమీటర్ల పాదయాత్రలో 1200 కిలోమీటర్లు పాదయాత్ర పూర్తయిందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పండితులు భక్తులు పాల్గొన్నారు.



శ్రీవారి పాదాలకు వేద ఆశీర్వచనం నిర్వహిస్తున్న పండితులు

## వైఎస్సార్ సీపీలో పలువురి చేరిక

రాజమహేంద్రవరం రూరల్: సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డితోనే రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం సాధ్యమని వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్, ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ అన్నారు. శనివారం హుకుంపేట డీబ్లాకు గౌతమినగర్‌లో శనివారం వైఎస్సార్ సీపీ నేత చెరకాని లోకేష్‌కుమార్ ఆధ్వర్యంలో ఆయన సమక్షంలో టీడీపీ, జనసేన నుంచి పలువురు వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి చందన నాగేశ్వర్, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్మన్ ఆకుల వీర్రాజు పార్టీ కండువాలు సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా చందన మాట్లాడుతూ సీఎం జగన్ చేపడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై టీడీపీ, జనసేన నుంచి పార్టీలో చేరుతున్నారన్నారు. గౌతమీ నగర్ నుంచి సూరంపూడి నాగరాజు, ఈశ్వరమ్మ, షేక్. మహమదున్నిసా బేగం, పితాని సోమరాజు, గోందేశీ వెంకటలక్ష్మి, మట్టా నాగమణి, బండి పద్మావతి, సాహు రాజేంద్రలతో సుమారు 100 మంది పార్టీలో చేరడం జరిగింది. ఈ కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్లు తాటికొండ విష్ణు మూర్తి, తాడలా చక్రవర్తి, సచివాలయం–2 కన్వీనర్స్ నేమాల సుశీల, తీగిరెడ్డి శ్రీనివాస్, మచ్చా దుర్గా ప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకులు కురుమళ్ళ అంజనేయులు, పెయ్యల రాజేష్, పుచ్చా గోవిందరెడ్డి, మామిడి దుర్గారావు, విక్రమ్, షేక్ భాజీ, సుధారాణి, కనక మహాలక్ష్మి,ప్రభుదేవా, సుందరపల్లి అనిల్, పుచ్చా ప్రసన్నకుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



హుకుంపేట డిబ్లాకులో వైఎస్సార్ సీపీలో చేరిన వారితో చందన నాగేశ్వర్, ఆకుల వీర్రాజు

### సమష్టి పోరాటాలతోనే ప్రభుత్వ రంగాన్ని రక్షించుకోగలం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఉద్యోగులు, కార్మిక, కర్షకులు పౌర సమాజంతో కలిసి సమష్టి పోరాటాలు చేయడం ద్వారానే ప్రభుత్వ రంగాన్ని రక్షించుకోగలమని, గీతం యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ సి.ప్రజ్ఞ అన్నారు. శనివారం స్థానిక మోడల్ కాలనీలోని ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం భవనంలో జరిగిన పూలే అంబేడ్కర్ స్మారక సదస్సులో ప్రభుత్వ రంగం ఎదుర్కొంటున్న సవాళ్లు–కర్తవ్యాలు అనే అంశంపై ప్రజ్ఞ ముఖ్యవక్తగా పాల్గొని ప్రసంగించారు. ఈ సదస్సుకి ఇన్సూరెన్స్ ఉద్యోగుల సంఘం ఉభయ గోదావరి జిల్లాల అధ్యక్షుడు గుబ్బల రాంబాబు అధ్యక్షత వహించారు. తొలిత పూలే అంబేడ్కర్ చిత్రపటాలకు ప్రజ్ఞ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉద్యోగుల సంఘం నాయకులు పి.సతీష్, ఎం.కోదండరాం ఎస్.గన్నేయ్య, ఏకే విశ్వనాథ్, ఆర్.శిరీష తదితరులు ప్రసంగించారు. ఇన్సూరెన్స్ ఉద్యోగులు సంఘం తరపున ప్రజ్ఞను దుశ్శాలువతో సత్కరించి జ్ఞాపికను బహుకరించారు.

## గోదావరిలో చెత్త తొలగింపు

రాజమహేంద్రవరం సిటీ: గోదావరి పరిరక్షణ సమితి ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా శనివారం గోదావరి పరిశుభ్రత కార్యక్రమం చేపట్టారు. పుష్కర ఘాట్ వద్ద గోదావరిలో పడవలను ఏర్పాటు చేసి నీటిలో తేలియాడుతున్న చెత్తా, చెదారాలను తొలగించారు. ఈ కార్యక్రమానికి వచ్చిన రాజమహేంద్రి గోదావరి పరిరక్షణ సమితి అధ్యక్షుడు టీకే విశ్వేశ్వర రెడ్డి మాట్లాడుతూ గోదావరి పరి రక్షణ అందరి బాధ్యత అన్నారు. గోదావరిలో ఉన్న చెత్తా, చెదారాలను తొలగించేందుకు గతంలో ఓఎన్జీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డి.ఎం.ఆర్.శేఖర్ రూ.50 లక్షలతో యంత్రాన్ని ఇవ్వగా కార్పొరేషన్ వారు ఒక యంత్రాన్ని తీసుకొచ్చి నెల రోజుల పాటు ట్రైల్ రన్ నిర్వహించారని, ఆ తర్వాత ఆ యంత్రం ఏమైందో తెలియదని ఆక్షేపించారు. ఆ తర్వాత మరో సారి ఇంకో యంత్రం తెచ్చారని అది కూడాముణ్ణాళ్ల ముచ్చటగా మారిందన్నారు. గోదావరి ప్రక్షాళనపై తలెత్తుతున్న ఇలాంటి ప్రతికూల విషయాలను గుర్తు పెట్టుకుని కలెక్టర్ కె.మాధవిలత గోదావరి పరి రక్షణకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా గోదావరి పరిరక్షణకు గతంలో చేపట్టిన 46 రోజుల ఉద్యమాలను వివరిస్తూ సమితి ముద్రించిన పుస్తకాన్ని ఈ సందర్భంగా విశ్వేశ్వరరెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సమితి నాయకులు వీరభద్రరావు, నెల్లి అప్పారావు, సివిల్ అప్పారావు, పట్నాయక్, ఎల్.వి.ప్రసాద్, సుబ్బారాజు, బర్రే కొండబాబు పాల్గొన్నారు.



గోదావరిలో వ్యర్థాలను తొలగిస్తున్న విశ్వేశ్వరరెడ్డి తదితరులు

## అధికారులకు ఉత్తమ సేవా అవార్డు

రాజమహేంద్రవరం రూరల్: రైతు దినోత్సవం సందర్భంగా జిల్లాలో పలువురికి ఉత్తమ సేవా అవార్డులు అందజేశారు. పంగిడిలో శనివారం నిర్వహించిన రైతు దినోత్సవ సభలో జిల్లా కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత వారికి ప్రశంసా పత్రాన్ని అందజేశారు. జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు, రాజమహేంద్రవరం వ్యవసాయ సహాయ సంచాలకులు డి.శ్రీనివాసరెడ్డి, డీఏవో కార్యాలయ వ్యవసాయాధికారి శివశ్రీనివాస్, సీతానగరం వ్యవసాయాధికారి కె.సూర్యరమేష్, రాజవోలు అగ్రికల్చర్ అసిస్టెంట్ దుర్గబాబు, కాటవరం గ్రామ వ్యవసాయ సహాయకులు ఎస్.భరద్వాజనాయుడులకు ఉత్తమ సేవా ప్రశంసాపత్రాలను అందించారు. ధాన్యం సేకరణ విషయంలో రైతులకు సేవలు అందించినందుకు ఈ ప్రశంసాపత్రాలు అందచేసినట్టు జాయింట్ కలెక్టర్ తేజ్‌భరత్ పేర్కొన్నారు. రాష్ట్ర వ్యవసాయాధికారుల సంఘ అధ్యక్షులు డి.వి.కృష్ణ, ఏఈవో సంఘ రాష్ట్ర అధ్యక్షులు వేణుమాధవరావు, పలువురు వ్యవసాయాధికారులు, విస్తరణాధికారులు అవార్డు గ్రహీతలను అభినందించారు.



కలెక్టర్, జాయింట్ కలెక్టర్ చేతులమీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న మాధవరావు, శ్రీనివాసరెడ్డి, దుర్గబాబు (కుడి నుంచి ఎడమ వైపునకు)

## పది, ఇంటర్‌లో ప్రతిభ సాధించిన విద్యార్థులకు బహుమతులు

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించిన పోలీసు అధికారులు, సిబ్బంది పిల్లలకు జిల్లా ఎస్పీ సీహెచ్ సుధీర్ కుమార్‌రెడ్డి చేతుల మీదుగా శనివారం డిస్ట్రిక్ట్ వెల్ఫేర్ ఫండ్ నుంచి ప్రోత్సాహక బహుమతిని అందజేశారు. పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించిన 35 మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ అందజేశారు.

**జనరల్‌బాడీ మీటింగ్..**

పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా పోలీస్ అసోసియేషన్ సభ్యులందరికీ జనరల్ బాడీ మీటింగ్ నిర్వహించారు. దీనికి జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల నుంచి సుమారు 20 మంది తూర్పుగోదావరి జిల్లా అసోసియేషన్ సభ్యులు హాజరయ్యారు. అనంతరం అసోసియేషన్ సభ్యులు, సిబ్బంది పలు సమస్యలు జిల్లా ఎస్పీ దృష్టికి తీసుకువెళ్లారు. జిల్లా సిబ్బంది సంక్షేమమే ముఖ్య ధ్యేయంగా పనిచేస్తున్నామని, సిబ్బందికి ఎటువంటి ఇబ్బందులు ఏదైనా సరే నేరుగా జిల్లా పోలీస్ కార్యాలయంలో తనను సంప్రదించాలని ఎస్పీ తెలియజేశారు. కారక్రమంలో అడిషనల్ ఎస్పీలు ఎస్.ఆర్ రాజశేఖర్ రాజు, జి.వెంకటేశ్వరరావు, డి.శ్రీనివాసరావు, జోనల్ డీఎస్పీ, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.